సాక్షి నిజామాబాద్

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



ఎరువుల వివరాలు..

ఎరువుల నిల్వ వివరాలను స్టాక్ బోర్డుపై రైతులకు తెలిసేలా ప్రదర్శించాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు.

- 8లో ▸



స్నేహం పేరిట దోపిడీలు..

సోషల్ మీడియా కేంద్రంగా స్నేహం పేరుతో అమాయకులను దోచుకుని దాడులకు పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.1 /23.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

మీనాక్షి నటరాజన్ నేటి కార్యక్రమాలు

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదివారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు శ్రమదానం కార్యక్రమం, అంకాపూర్ గ్రామంలో ఉదయం 10.30 గంటలకు జెండా ఆవిష్కరణ, తేనేటి విందులో పాల్గొననున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు అర్గుల్ రోడ్డులో గల పీవీఆర్ గార్డెన్‌లో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశంలో మీనాక్షి పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషిచేయాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్టీసీని మరింత అభివృద్ధి చేయడానికి ఉద్యోగులందరూ కృషి చేయాలని రీజినల్ మేనేజర్ జోత్స్న అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శనివారం ప్రగతి చక్ర అవార్డు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు ఆర్టీసీని ఆదరించాలన్నారు. అనంతరం పలువురు ఉద్యోగులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. ఆర్మూర్, నిజామాబాద్–1, 2, బోధన్, బాన్సువాడ, కామారెడ్డి డిపో డిపోమేనేజర్‌లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్




రుద్రూర్: ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ సూచించారు. పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామంలో శనివారం కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమం నిర్వహించారు. రైతు వేదికలో ఏర్పాటు చేసిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.

ఈ సందర్భంగా డీఏవో గోవింద్ మాట్లాడుతూ వ్యవసాయ పనుల కోసం 20 విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా జిల్లాకు రూ.17 కోట్లు విడుదల చేశారని వెల్లడించారు. రైతులు పంటల్లో యూరియా వినియోగం తగ్గించి నానో యూరియా వాడకంపై దృష్టి సారించాలని సూచించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త విజయ్ కుమార్ మాట్లాడుతూ సోయా చిక్కుడు, వరి పంటలలో పురుగు మందుల పిచికారీ తగ్గించి వివిధ సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఇంఛార్జి ఇందుధర్ రెడ్డి, విస్తరణ శాస్త్రవేత్త శ్వేత, ఏఎంసీ చైర్మన్ హన్మంతు, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఏవో, శాస్త్రవేత్తల బృందం హెగ్డోలి శివారులోని పంట పొలాలను పరిశీలించారు.

స్నేహమంటే ఇదేరా..

సుభాష్‌నగర్: స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్‌షిప్‌పై 'సాక్షి' సర్వే నిర్వహించింది. 50 మంది స్త్రీలు, మరో 50 మంది పురుషులను కలిసిన 'సాక్షి' ఫ్రెండ్‌షిప్‌పై అభిప్రాయాలను తెలుసుకుంది. వారంతా ఫ్రెండ్‌షిప్‌పై అభిప్రాయాలను వెల్లడించారిలా..

- ఫ్రెండ్ షిప్ అంటే.. మీ దృష్టిలో..




ఏ) కల్మషం లేనిది (71 మంది)
బీ)అవసరాలు తీర్చేది (29 మంది)
పురుషులు 65 స్త్రీలు 35

- ఫ్రెండ్‌షిప్ కూడా.. కలుషితమైందా..!




ఏ) అవును (64)
బీ)లేదు (36)
పు : 70 స్త్రీ : 30

- నీకు ఎంతమంది నిజమైన ఫ్రెండ్స్ ఉన్నారు..



ఏ)ఒకరు (28)
బీ)ఇద్దరికి మించి (72)
పు : 56 స్త్రీ : 44

- నీ ఫ్రెండ్‌కు ఇచ్చే స్థానం..?



ఏ) అమ్మ, నాన్న, ఫ్రెండ్ (50)
(బీ) ఫ్రెండ్, అమ్మ, నాన్న (10)
(సీ) నాన్న, అమ్మ, (40)
పు : 51 స్త్రీ : 49

స్నేహం.. ఆ పదంలోని శక్తి ఉత్సాహాన్నిస్తుంది. పక్కన ఫ్రెండ్ ఉంటే ఎక్కడా లేని ధైర్యం వస్తుంది. కొందరు చెడ్డీ దోస్తులైతే.. మరికొందరిని పాఠశాలలు కలిపాయి. మరికొందరిని వారి అభిరుచులు, అభిప్రాయాలు కలిపాయి. ఏది ఏమైనా.. స్నేహం ఎక్కడ మొదలైనా.. కష్టసుఖాల్లో తోడుంటోంది. ఫ్రెండ్ షిప్ అంటే కల్మషం లేనిదని, ఎన్నటికీ కలుషితం కానిదని అంటున్నారు. తమ స్నేహం సమాజానికి ఆదర్శంగా నిలువాలని కోరుకునే వారు తమవంతు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మరికొంత మంది స్నేహితులు తాము పుట్టిన ఊరికి, విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు సేవ చేస్తున్నారు. దశాబ్దాలు కాలగర్భంలో కలుస్తున్నా తమ ఫ్రెండ్‌షిప్ నిత్యనూతనమని.. స్నేహితానికి మానవత్వాన్ని తోడు చేసి ముందుకు సాగుతున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' సండే స్పెషల్



స్నేహితం

ఒకరికొకరు తోడుగా..

- ఆదర్శంగా నిలుస్తున్న స్నేహితులు
- కష్టాల్లో ఎవరున్నా కదిలి వెళ్తున్నారు
- పుట్టిన ఊరికి.. చదివిన స్కూల్‌కి అండగా..
- నేడు స్నేహితుల దినోత్సవం

సండే స్పెషల్

అయ్యప్ప కలిపిన స్నేహం



ధన్‌పాల్ సూర్యనారాయణ, మంచాల జ్ఞానేందర్

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ప్రముఖ వ్యాపారి, సామాజిక సేవకుడు మంచాల జ్ఞానేందర్ స్నేహబంధానికి 30ఏళ్లు. అయ్యప్ప మాలధారణ మొదటిసారి వారిరువురిని కలిపింది. ఆ తర్వాత మరో 14 ఏళ్లు వరుసగా అయ్యప్ప దీక్ష తీసుకోవడంతో వారి మధ్య స్నేహబంధం ధృడమైంది. వారి స్నేహం ఫ్యామిలీ ఫ్రెండ్‌షిప్‌గా మారింది. స్వతహాగా వ్యాపారి అయిన ధన్‌పాల్ తన తల్లిదండ్రుల పేరుతో ట్రస్ట్ ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఆలయాల నిర్మాణాలకు సహకారం అందిస్తున్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకున్న మంచాల జ్ఞానేందర్ సైతం తన తండ్రి పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను చేస్తున్నారు. నగరంలోని అమ్మనగర్‌లో వారాహి మాతా ఆలయాన్ని నిర్మిస్తున్నారు.

నిజామాబాద్ నగరానికి చెందిన బైక్ మెకానిక్, గురు స్వామి ధాత్రిక రతన్, బీర్కూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ సుధాకర్ యాదవ్ స్నేహం శబరిమల పాదయాత్రతో ధృడమైంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమారుడు వైఎస్ జగన్ 2010లో ప్రారంభించిన వైఎస్ఆర్‌సీపీలో వీరిరువురికి పరిచయం ఏర్పడింది. 15 ఏళ్లలో నాలుగు సార్లు శబరిమలకు, ఒకసారి షిర్డీకి పాదయాత్ర చేపట్టడంతో వారి మధ్య స్నేహం బలపడింది. ఇద్దరూ కలిసి అయ్యప్ప మాల ధరిస్తూ, దీక్ష పూర్తి కాగానే తీర్థయాత్రలకు బయల్దేరుతారు. తాజాగా అమర్‌నాథ్, కేదర్‌నాథ్, బద్రినాథ్, ఇతర తీర్థయాత్రలు కలిసే చేసుకున్నారు. ఇరు కుటుంబాల మధ్య విడదీయలేని స్నేహబంధం ఏర్పడింది.



రతన్, సుధాకర్ యాదవ్

కష్టాల్లో ఉన్నవారికి అండగా..



స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం చేస్తూ..

- మేమున్నామంటున్న హోప్ ఫౌండేషన్

మోర్తాడ్: కష్టాల్లో ఉన్నవారికి మే మున్నామని భరోసానిస్తోంది ఫ్రెండ్స్ హోప్ ఫౌండేషన్. ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ ఉన్నత పాఠశాలలో (1999–2000 ఎస్సెస్సీ బ్యాచ్) చదువుకున్న స్నేహితులు తమలో ఎవరైనా కష్టాల్లో ఉంటే వెంటనే ఆ కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారు. తమతో చదువుకుని కానరాని లోకాలకు వెళ్లిన వారికి, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఆర్థిక సాయం అందిస్తూ పెద్ద మనసును చాటుకుంటున్నారు. మహతి ఆశ్రమ విద్యార్థులకు రూ.50వేల సాయం అందించారు. ఆశ్రమంలోని విద్యార్థులకు ప్రతి ఏటా ఏదో ఒక సాయం చేస్తున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే లక్ష్యంగా 'తండ్రి డైరీలో చివరి పేజీ' పేరుతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తూ మార్పు కోసం ప్రయత్నిస్తున్నారు. రెండు, మూడు నెలలకోసారి సమావేశమై స్నేహితుల్లో ఎవరైనా కష్టాల్లో ఉంటే వెంటనే అండగా నిలుస్తున్నారు.

గ్రామాభివృద్ధి, సమాజ సేవ సూర్యయూత్

- ఊరికి సేవలందిస్తున్న మిత్రులు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని దూస్‌గాం గ్రామానికి చెందిన 21 మంది స్నేహితులు తమ ఊరి అభివృద్ధి, సమాజ సేవే లక్ష్యంగా సూర్య యూత్‌ను ఏర్పాటు చేశారు. 2007లో సూర్య యూత్ పేరుతో బృందంగా ఏర్పడిన వారంతా ప్రతినెలా కొంత మొత్తాన్ని జమ చేస్తూ స్వచ్ఛంద సేవ చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ట్యాంకు నిర్మించారు. ప్రతి ఏడాది గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియల వరకు మృతదేహాన్ని భద్రపర్చేందుకు అవసరమైన ఫ్రీజర్‌ను అందజేశారు. పేద కుటుంబాలకు చెందిన ఇంటిపెద్ద మరణిస్తే ఆ కుటుంబానికి తమ వంతుగా రూ.5వేల నుంచి రూ.10వేల ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఇలా గత 18 సంవత్సరాలుగా స్నేహితులైన సూర్య యూత్ సభ్యులు గ్రామాభివృద్ధితో పాటు సమాజ సేవకు పాటుపడుతున్నారు. ప్రస్తుతం యూత్ అధ్యక్షుడిగా కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా టి.సాయిలు, ప్రధాన కార్యదర్శిగా గద్దె సత్యనారాయణ, కోశాధికారిగా జి.రాజు వ్యవహరిస్తున్నారు.

మూడు దశాబ్దాల స్నేహం

- 21 ఏళ్ల వయస్సు తేడా ఉన్నా అభిప్రాయాలు ఒకటే..
- ఒకరు శరీరమైతే.. మరొకరు ఆత్మ!
- ఎక్కడికి వెళ్లినా ఇద్దరూ కలిసే..
- ఆదర్శంగా నిలుస్తున్న తాహెర్, పారుపల్లి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వయస్సులో ఇద్దరి మధ్య 21 ఏళ్ల తేడా ఉన్నా వారి అభిప్రాయాలు మాత్రం ఒకటే. 34 ఏళ్ల వారి స్నేహ బంధానికి చూసిన వారు ఎవరైనా ముగ్ధులుకావాల్సిందే.. అభినందించి తీరాల్సిందే. వారే తాహెర్‌బిన్ హందాన్, పారుపల్లి గంగారెడ్డి. సిరికొండ గ్రామానికి చెందిన వీరు ఇద్దరు కాదు.. ఒక్కరే అని అంటారు. తాహెర్‌బిన్ వయస్సు 72 సంవత్సరాలు కాగా పారుపల్లి గంగారెడ్డి వయస్సు 51 సంవత్సరాలు. పారుపల్లి గంగారెడ్డి తండ్రి పారుపల్లి నారాయణ, తాహెర్‌బిన్ ఇద్దరూ కలిసి ప్రాథమిక స్థాయిలో విద్యనభ్యసించారు. సిరికొండలో ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. కాలక్రమంలో 1991 జనవరిలో తాహెర్‌బిన్, గంగారెడ్డి మధ్య నిజామాబాద్‌లో అనుకోకుండా స్నేహం కుదిరింది. అప్పటినుంచి ప్రతి అడుగులో, ప్రతి కదలికలో ఇద్దరూ కలిసే ఉంటూ వస్తున్నారు. ఈ 34 ఏళ్ల కాలంలో వీరిద్దరూ కలిసి వాహనాల్లో 18 లక్షల కిలోమీటర్లు ప్రయాణించారు. ఢిల్లీ మొదలు దేశంలోని అనేక ప్రాంతాలకు వీళ్లిదరూ కలిసే వెళ్లారు. నిజామాబాద్‌లో ఉన్నప్పుడు పొద్దున లేచింది మొదలు రాత్రి నిద్రించే సమయం వరకు వారు కలిసే ఉంటారు. వారి గురించి తెలిసిన వారంతా తాహెర్ శరీరమైతే గంగారెడ్డి ఆత్మ అని అంటారు.

తాహెర్ ప్రస్తుతం ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా, గంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. తాహెర్ 1994లో బోధన్ నుంచి, 2018లో నిజామాబాద్ అర్బన్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసినప్పుడు గంగారెడ్డి అన్నీ తానై వ్యవహరించాడు. 2018లో తాహెర్‌కు టిక్కెట్టు సాధించేందుకు గంగారెడ్డే పెద్ద స్థాయిలో ఢిల్లీ వరకు లాబీయింగ్ చేయడం విశేషం. ధర్మపురి శ్రీనివాస్ నుంచి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి వరకు ప్రతిఒక్కరూ వీరిద్దరి స్నేహాన్ని చూసి ముచ్చటపడిన సందర్భాలు అనేకం.



పంటల నమోదు ఇంకెప్పుడు?

- వెబ్‌సైట్ మూసి ఉంచిన ప్రభుత్వం
- మొదలుకాని ఖరీఫ్ క్రాప్ బుకింగ్
- గైడ్‌లైన్స్ కోసం ఏఈవోల ఎదురుచూపులు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల సాగు దాదాపు పూర్తయింది. పసుపు, సోయా, మొక్కజొన్న పంటలను రైతులు ఎప్పుడో వేయగా, వరి నాట్లు చివరి దశలో ఉన్నాయి. అయితే ఏ రైతు ఏ పంట వేశాడు? ఎన్ని ఎకరాల్లో వేశారనే వివరాలు ఇంకా ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. జూన్‌లోనే మొదలు కావాల్సిన పంటల నమోదు కార్యక్రమం ఆగస్టు వచ్చినా ప్రారంభం కాలేదు. ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే పోర్టల్‌ను మూసి ఉంచడమే అందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పంటల నమోదు చేయలేకపోతున్నారు. ప్రభుత్వం పోర్టల్‌ను ఎప్పుడు తెరిచి గైడ్‌లైన్స్ ఇస్తుందో అధికారులకూ తెలియని పరిస్థితి. ఆలస్యమైతే మక్క, సోయా లాంటి పంటల కోతలు మొదలవుతాయి. జిల్లాలో ప్రధాన పంటలన్నీ కలిపి 5 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసే పంటలను ప్రభుత్వం కొనే ముందు సర్వేను చేస్తుంది. ఇందుకు డీసీఎస్ అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. పంటల వివరాలు నమోదు చేస్తే ఏ పంట ఎంత దిగుబడి వచ్చే అవకాశముంది, ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలో ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఖరీఫ్ సీజన్ పంటల నమోదుకు ప్రభుత్వం సైట్‌ను ఎందుకు తెరవడం లేదని డీఏవో గోవింద్‌ను సంప్రదించగా.. అప్‌డేషన్ జరుగుతున్నట్లుగా తమకు సమాచారం ఉందని తెలిపారు.



డొంకేశ్వర్‌లో సాగవుతున్న మొక్కజొన్న

జిల్లాలో సాగవుతున్న ప్రధాన పంటలు (ఎకరాల్లో)

వరి	3,84,592
మొక్కజొన్న	47,466
సోయా	33,247
పసుపు	22,922
పత్తి	876
కంది	559

ఆశలు పదిలం..

- 39 టీఎంసీలకు చేరిన ఎస్సారెస్పీ నీటి నిల్వ
- కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతుండడంతో ఆయకట్టు రైతుల ఆశలు పదిలమయ్యాయి. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ సరైన వర్షాలు కురవకపోవడం, ఎగువ నుంచి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేకపోవడంతో రైతులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. స్థానికంగా కురిసిన వర్షాలతోపాటు మహారాష్ట్ర నుంచి వరద రావడంతో ఎస్సారెస్పీ నీటిమట్టం క్రమంగా పెరిగింది. ఎగువ నుంచి భారీ వరదలు రావడంతో నీటి నిల్వ 39 టీఎంసీలకు చేరింది. మహారాష్ట్రలోని విష్ణుపురి ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేయడంతో గరిష్టంగా లక్షా 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, నాలుగు రోజుల వ్యవధిలో 15 టీఎంసీల నీరు వచ్చింది.



ఎస్సారెస్పీలో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు

50 టీఎంసీల నీరు నిల్వ ఉంటేనే..

ఆయకట్టు పరిధిలో ఒక్క పంటకు నీరందించాలంటే ప్రాజెక్టులో కనీసం 50 టీఎంసీల నీటి నిల్వ ఉండాలి. ప్రస్తుతం 39.18 టీఎంసీల నీరుండగా, మరో 11 టీఎంసీలు అవసరం ఉంది. అక్టోబర్ 28వ తేదీ వరకు ఎగువన ఉన్న బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు మూసే అవకాశం లేదు. సుమారు మూడు నెలల కాలంలో ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కచ్చితంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రాజెక్టులో 50 టీఎంసీల నీరు నిల్వ ఉంటే.. 5 టీఎంసీలు డెడ్‌స్టోరేజీ, 5 టీఎంసీలు తాగు నీటి అవసరాలకు, 5 టీఎంసీలు ఆవిరి రూపంలో పోగా, మిగతా 35 టీఎంసీల నీటిని ఖరీఫ్ పంటకు అందించొచ్చు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ఊరించిన వరద..

వారం రోజులుగా కురిసిన వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి గరిష్టంగా లక్షా 5 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. కానీ రెండ్రోజుల్లోనే వరద నీరు తగ్గుముఖం పట్టింది. 4,352 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. ఆవిరి రూపంలో 443 క్యూసెక్కులు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1077.80 (39.18 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

ఎలాంటి ఆదేశాలు రాలేవు

ఎస్సారెస్పీ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల చేపట్టేందుకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. మరింత వరద వచ్చి చేరితే నీటి విడుదల చేపట్టే అవకాశం ఉంది. ప్రాజెక్ట్‌లో నీటి వివరాల లెక్కలను ఉన్నతాధికారులకు పంపించాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

లింబాద్రి గుట్ట మీదుగా టెంపుల్ కారిడార్

- ధర్మపురి నుంచి బాసర వరకు..
- తెలంగాణ యూనివర్సిటీలో వ్యవసాయ కళాశాల
- జీజీహెచ్‌లో కార్డియాక్ సెంటర్‌కు వైద్యారోగ్య మంత్రి సానుకూల స్పందన
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు
- ఆర్మూర్‌లో జనహిత పాదయాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్
- 80శాతం హామీల అమలు: మీనాక్షి



పాదయాత్రలో మీనాక్షి, మహేశ్‌గౌడ్, మంత్రి సీతక్క, షబ్బీర్, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, మదన్, తదితరులు

ఆర్మూర్ : జగిత్యాల జిల్లా ధర్మపురి నుంచి వేములవాడ, లింబాద్రి గుట్ట మీదుగా బాసర వరకు నాలుగు లేన్లతో టెంపుల్ కారిడార్ నిర్మాణానికి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో కారిడార్ మంజూరవుతుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జనహిత పాదయాత్రను శనివారం నిర్వహించారు. ఆర్మూర్‌లోని ఆలూర్ రోడ్డులో మహేశ్‌కుమార్‌గౌడ్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించగా, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ జనహిత పాదయాత్రను ప్రారంభించారు.



ప్రసంగిస్తున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

కాశీ హనుమాన్ మున్నూరు కాపు సంఘ భవనంలో రైతులు, లబ్ధిదారులతో మాట్లాడారు.

టీపీసీసీ అధ్యక్షుల జిల్లాను అభివృద్ధి చేస్తాం..

టీపీసీసీ అధ్యక్షుల జిల్లా అయిన నిజామాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఉత్తర తెలంగాణలోనే మేటి జిల్లాగా తీర్చిదిద్దుతామని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. డి శ్రీనివాస్ రెండు పర్యాయాలు తాను మొదటి సారి ఈ జిల్లా నుంచే టీపీసీసీ స్థానాలకు ఎంపికయ్యామన్నారు. తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరైందని, త్వరలో వ్యవసాయ కళాశాలను సైతం ఏర్పాటవుతుందని హామీ ఇచ్చారు. అన్ని సౌకర్యాలతో జిల్లా కేంద్రంలో స్టేడియం నిర్మిస్తామన్నారు. లింబాద్రి గుట్ట వద్ద గెస్ట్ హౌస్ నిర్మాణం చేస్తున్నామన్నారు. సిద్దుల గుట్టకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో విమానాశ్రయం సైతం ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కార్డియాక్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి వైద్యారోగ్య శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. గుళ్లు బీజేపీ సొత్తు కాదని, తాము కూడా శ్రీరామ చంద్రుడిని పూజిస్తామని, ఎన్నికల్లో ఓట్ల కోసం దేవుడిని వాడుకోబోమన్నారు. ఆర్మూర్‌లో గంగిరెద్దులాయన ఎమ్మెల్యేగా చేసి తన కాంప్లెక్సులు కట్టుకొని ఆర్టీసీకి బకాయి పడి ముఖం చాటేసాడని ఆరోపించారు. తాము బీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తుంటే బిల్లు సిద్ధం చేస్తున్న సమయంలో జైలులో ఉన్న మాజీ ఎంపీ కవిత తాను చేసినట్లు రంగు పూసుకొనే ప్రయత్నం చేస్తోందని ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌తో పెరిగిన సీట్లను సైతం గెలుచుకుని అధిష్టానానికి బహుమతిగా ఇస్తామన్నారు. అంతకు ముందు ఏఐసీసీ కార్యదర్శి సంపత్, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, మాజీ ఎంపీ మధుయాష్కి మాట్లాడారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల ఇన్‌చార్జులు వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, నాయకులు ఆకుల లలిత, కోల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో మాట్లాడిన రైతులు..

గత ప్రభుత్వ హయాంలో ఎదురైన ధరణి సమస్యలను పరిష్కరించాలని రైతులు మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె రైతులను సీఎం రేవంత్ రెడ్డితో నేరుగా మాట్లాడించి భూభారతిలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఏఐసీసీ సెక్రెటరీ సంపత్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు మదన్ మోహన్, భూపతిరెడ్డి, లక్ష్మీకాంతారావు, మాజీ విప్ ఈరవత్రి అనిల్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి వెంట రాగా అక్కడి నుంచి గోల్ బంగ్లా, పాత బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు పాద యాత్ర నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కొత్త బస్టాండ్, మామిడిపల్లి చౌరస్తా మీదుగా పెర్కిట్ చౌరస్తా వరకు పాదయాత్ర కొనసాగించారు. పెర్కిట్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఎన్నికల హామీలను 80 శాతం పూర్తి చేశామని, రానున్న రోజుల్లో వంద శాతం హామీలను నెరవేరుస్తామన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యాయా?

- మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్ సమాధానం చెప్పాలి
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ప్రజలకు చెప్పిన గ్యారెంటీలు ఏ ఒక్కటైనా సక్రమంగా అమలయ్యాయా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నిస్తూ శనివారం మీడియాకు వీడియో విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలపై ఆర్మూర్‌లో చేస్తున్న పాదయాత్రలో మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ సమాధానం చెప్పాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి పేరు చెప్పుకుని ఓట్లు అడిగే పరిస్థితి కాంగ్రెస్ పార్టీకి లేదని, అందుకే మీనాక్షి నటరాజన్‌ను ముందుపెట్టి ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రయత్నం చేస్తోందన్నారు. డిక్లరేషన్‌ల పేరిట ఢిల్లీ నుంచి రోజుకో నాయకుడిని రప్పించి వారితో హామీలు ఇప్పించి మొదటిసారి మోసం చేశారని ఆరోపించారు. రుణమాఫీ, రైతుభరోసా, పసుపు రైతులకు కలిపి కేవలం నిజామాబాద్ జిల్లా రైతులకే కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 4500 కోట్లు బాకీ ఉందని పేర్కొన్నారు. పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యాశాఖలో తాత్కాలిక ఖాళీల జాబితా విడుదల

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో పదోన్నతులకు చెందిన తాత్కాలిక ఖాళీల జాబితాను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ విడుదల చేశారు. సబ్జెక్టుల వారీగా వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం తుది జాబితాను విడుదల చేయనున్నారు.

నేడు చందూర్‌కు మంత్రి సీతక్క రాక

వర్ని: రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదివారం చందూరు, మోస్రా మండలాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. చందూరు, మోస్రా మండల కేంద్రాల్లో నూతనంగా నిర్మించిన మండల కార్యాలయాల భవనాలతో పాటు గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించనున్నారు.

ఆడపిల్లలు నైపుణ్యాభివృద్ధి సాధించాలి



బోధన్: పోటీ ప్రపంచంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేందుకు చదువుతోపాటు నైపుణ్యాభివృద్ధిలో ప్రగతి సాధించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఎస్‌కే రసూల్‌బీ పేర్కొన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ, జిల్లా మహిళా సాధికారత ఆధ్వర్యంలో 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా డివిజన్ స్థాయి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ట్రెనింగ్ ఫర్ ట్రెయినర్ అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రసూల్ బీ మాట్లాడుతూ ఆడపిల్లల భద్రత, వారి సంక్షేమం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. డాటా ప్రో ఎడ్యుకేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రతినిధి, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ శ్రీహరి మాట్లాడుతూ బాలల హక్కులు, కెరీర్ గైడెన్స్ అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. బోధన్ సీడీపీవో పద్మ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ స్వప్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నందిని, రాధిక రాథోడ్, శ్రీలత, మణి, గోపిలక్ష్మి, కొమరవ్వ, విజయరాణి, సౌజన్య, గంగావేణి, సావిత్రి, ఆసియా తదితరులు పాల్గొన్నారు.


మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్‌లకు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న స్థానికులు


ఆలూర్ రోడ్‌లో జెండా ఎగురవేస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్


జనహిత పాదయాత్రలో పాల్గొన్న ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు

ఆర్మూర్‌లో జనహిత పాదయాత్ర

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ శనివారం ఆర్మూర్‌లో జనహిత పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి కార్యకర్తలు, నాయకులు స్వాగతం పలికారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను పాదయాత్రలో వివరిస్తూ ముందుకు సాగారు.


డప్పు కొడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి

స్నేహం పేరిట దోపిడీలు..

- సోషల్ మీడియా వేదికగా యాప్‌లతో వల
- నిర్మానుష్య ప్రాంతాలకు పిలిచి దాడులు, దోపిడీ
- ఐదుగురి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: స్నేహం పేరు మీద సోషల్ మీడియాలో నుంచి పలు యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, వాటిలో గ్రూప్‌లు తయారు చేసి సభ్యులను చేర్చడం, ఆపై అమాయకులను టార్గెట్ చేసి దాడులు, దోపిడీలకు పాల్పడటం వారి పని. కామారెడ్డితో పాటు చుట్టు పక్కల జిల్లాలలో నాలుగేళ్లుగా ఓ కొత్త రకం దోపిడీలను గుట్టుచప్పుడు కాకుండా చేస్తూ, లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్న ఓ ముఠాను కామారెడ్డి పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర వివరాలు వెల్లడించారు. గత నెల 25న ఓ బాధితుడు పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. సోషల్ మీడియా యాప్‌ల ద్వారా పరిచయమైన కొందరు వ్యక్తులు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మెగా కార్ షెడ్డు వద్దకు తనను పిలిపించి తన ఫొటోలు తీసి, వాటిని అసభ్యకరంగా మార్ఫింగ్ చేయడమే కాకుండా డబ్బులు ఇవ్వకుంటే వాటిని అందరికీ పంపిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశాడు. ఫోన్‌పే ద్వారా బలవంతంగా డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. కామారెడ్డి పట్టణానికి చెందిన షేక్ జోహెబ్, మహమ్మద్ మిరాజ్ పాషా, సయ్యద్ ముజాఫర్ అలీ, సిరిసిల్ల జిల్లా చంద్రంపేట్ గ్రామానికి చెందిన షేక్ సాహైల్ లతో పాటు ఓ మైనర్ లను నిందితులుగా గుర్తించారు. వారంతా గత నాలుగేళ్లుగా సోషల్ మీడియా యాప్‌ల ద్వారా అమాయకులకు వల వేస్తున్నట్లు విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, మేడ్చల్ ప్రాంతాల్లోని 41 ఘటనల్లో ఈ ముఠా దాడులు, వసూళ్లకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. వసూళ్ల మొత్తం ఇప్పటికి రూ. 8 లక్షల వరకు నిర్ధారణ జరిగిందన్నారు. కాగా రూ. 40 లక్షలకు పైగా వసూలు చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నిందితులపై కామారెడ్డిలో 6, సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి పీఎస్ పరిధిలో 2, నిజామాబాద్‌లో ఒకటి చొప్పున మొత్తం 9 కేసులు నమోదైనట్లు ఎస్పీ వెల్లడించారు. ఇంకా చాలామంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోందన్నారు.

ఎవరైనా బాధితులు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ముఠా సభ్యులపై గతంలో కూడా కామారెడ్డి, సిరిసిల్ల, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో 11 కేసులు ఉన్నాయన్నారు. వాటిలో నిజామాబాద్‌లో ఓ యువకుడిని గతంలో ఇదే తరహాలో నమ్మించి హత్యకు పాల్పడిన కేసు కూడా ఉందని వివరించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని అన్నారు.

సోషల్ మీడియా యాప్‌లతో పరిచయాలు..

నిందితులు సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుంటారు. యూత్, ట్రాన్స్‌జెండర్, లెస్బియన్స్, తదితర వాట్సప్ గ్రూప్ లను డౌన్‌లోడ్ చేసి వాటిలో చాలామందిని యాడ్ చేస్తూ గ్రూప్‌లుగా తయారు చేస్తారు. ముఖ్యంగా స్వలింగ సంపర్కులను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తుంది. పరిచయాలు పెంచుకుని అమయకులైన లెజ్బియన్ లను నిర్మాణుష్య ప్రదేశాలకు పిలుస్తారు. రాగానే దాడులకు పాల్పడి ఉన్నదంతా దోచుకుంటారు. అంతే కాకుండా ఫొటోలు తీసి, డబ్బులు ఇవ్వాలనీ, లేకుంటే మార్ఫింగ్ చేసి అందరికీ షేర్ చేస్తామని బెదిరిస్తారు. నిందితుల్లో షేక్ సోహైల్ ఇదివరకు ఆర్మీలో పని చేసి వచ్చాడు. సోషల్ మీడియా పరిచయాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన ఎస్పీ సూచించారు. కేసు ఛేదనలో కృషి చేసిన పట్టణ సీఐ నరహరి, సీసీఎస్ ఎస్సైలు శ్రీనివాస్, ఉస్మాన్, నరేష్, వినయ్ సాగర్, రాజారాం, బాల్ రెడ్డి, నరేష్, సిబ్బంది మైసయ్య, రవి, కమలాకర్, నరేష్, రాజు, భాస్కర్ లను అభినందించారు.

పగలు రెక్కీ.. రాత్రి దోపిడీ!

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
- రూ. 16 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: పగలు ఐస్ క్రీంలు అమ్ముతూ రెక్కీ నిర్వహిస్తూ రాత్రి సమయాల్లో దారి దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్న ఓ అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి దాదాపు రూ.16 లక్షల సొత్తును రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం మీడియాకు కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర వివరాలు వెల్లడించారు. జూలై 25న రాత్రి సమయంలో భిక్కనూర్ మండలం అంతంపల్లి శివారులో ఉన్న ఓ రెడీమిక్స్ ప్లాంట్‌లోకి గుర్తు తెలియని దుండగులు చొరబడి ఇద్దరు వాచ్‌మన్‌లను బెదిరించి సెల్‌ఫోన్‌లు, సెంట్రింగ్ రాడ్లును దోచుకెళ్లారు. 27న రాజంపేట మండలం తలమడ్ల శివారులో ఉన్న ఓ ఫార్మా కంపనీలోకి రాత్రి సమయంలో చొరబడిన దుండగులు మందులు తయారు చేసే రూ.15 లక్షల విలువైన యంత్ర పరికరాలను ఎత్తుకెళ్లారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి ఆయా పీఎస్‌లలో కేసులు నమోదయ్యాయి. సీరియస్‌గా తీసుకున్న పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ఏఎస్పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాలతో నిందితులను ఉత్తరప్రదేశ్‌కు చెందిన తానే అలీ, బిర్జేష్ అలీ, సల్మాన్, మహమ్మద్ సమీర్, చాంద్ బాబులుగా గుర్తించారు. వారు కొద్దిరోజులుగా కామారెడ్డిలోని ఆదర్శ్ నగర్, ఇందిరా నగర్ కాలనీల్లో నివాసం ఉంటూ ఐస్‌క్రీం వ్యాపారం ముసుగులో చోరీలు, దోపిడీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. శనివారం భిక్కనూర్ టోల్‌గేట్ వద్ద ఒకరిని, కామారెడ్డిలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఫార్మా కంపెనీకి చెందిన రూ.15 లక్షల విలువైన యంత్ర సామగ్రి, సెల్‌ఫోన్, సెంట్రింగ్ రాడ్లు, కాపర్ కేబుల్, 2 మోటార్లు, ఇతర సామగ్రిని రికవరీ చేశామన్నారు. అంతే కాకుండా నిందితులు ఉపయోగించిన ఆటోలు, బైక్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ రెండు నేరాలతోపాటు నిందితులు కొద్ది రోజుల క్రితం మాచారెడ్డి మండలం పరిధిలో మరో 4 చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు.

హైదరాబాద్‌లో రిసీవర్..

ఐస్‌క్రీంలు అమ్ముకునే ముసుగులో నేరాలకు పాల్పడుతున్న ఈ ముఠాకు హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన హసన్ ఖాన్ అనే వ్యక్తి రిసీవర్‌గా పనిచేసినట్లు పోలీసులు గుర్తించారు. అతడిని కూడా అరెస్ట్ చేశారు. నిందితులు పథకం ప్రకారమే దారి దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతుంటారు. రెక్కీ సమయంలో అనువుగా ఉన్న ప్రదేశాలను ఎంచుకుంటారు. ఏ వస్తువును చోరీ చేసినా రవాణా చేయడానికి హసన్ ఖాన్ వాహనాన్ని సిద్ధం చేసి ఉంచేవాడని ఎస్పీ తెలిపారు. ముషీరాబాద్ చేరగానే ఎక్కడి పార్టులు అక్కడ విప్పేసి అమ్మేస్తారని వెల్లడించారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐలు సంపత్ కుమార్, రామన్, ఎస్సైలు శ్రీనివాస్, ఉస్మాన్, ఆంజనేయులు, అనిల్, ఏఎస్సై వెంకట్ రావు, సిబ్బంది కిషన్, రాజవీరు, గణపతి, మైసయ్య, స్వామి, రాజేంద్ర కుమార్, రజినీకాంత్, కిషన్ గౌడ్, రవి, నరేష్, లక్ష్మీకాంత్, రాములును అభినందించారు.

మాన్‌ధన్ యోజన.. రైతులకు భరోసా

మీకు తెలుసా?



కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన ద్వారా వయసు పైబడిన రైతులకు సామాజిక భద్రత కల్పిస్తోంది. మలిదశలో ఏ పని చేయలేని రైతులకు ఈ పథకం కొంత ఆసరాగా నిలుస్తుంది. 2019, సెప్టెంబర్‌లో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు.

- ఈ పథకానికి గరిష్ఠంగా ఐదెకరాలలోపు సాగు భూమి ఉండి, 18–40 ఏళ్ల లోపు వయసున్న రైతులు అర్హులు.
- అధికారులు, ఉద్యోగులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు, ఇతర వృత్తి నిపుణులు ఈ పథకానికి అనర్హులు.
- రైతులు కామన్ సర్వీస్ కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.
- రైతు ఫొటో, నివాస ధ్రువీకరణ పత్రం, వయస్సు నిర్ధారణ, సాగు భూమి, ఆధార్ కార్డు తదితర పత్రాలు సమర్పించాలి.
- కేంద్ర పీఎంకేఎం పోర్టల్‌లో వివరాలు నమోదు చేశాక రైతుల మొబైల్‌కు సమాచారం అందుతుంది. ప్రత్యేకంగా పింఛన్ ఖాతాను తెరిచి కార్డు అందిస్తారు. వివరాలు నమోదు చేసినందుకు మీసేవా కేంద్రానికి రూ. 30 ప్రభుత్వమే చెల్లిస్తుంది.
- ప్రతి నెలా సదరు కేంద్రంలోనే కిస్తీ చెల్లించవచ్చు నెల వారీగా లేదా 3,4,6 నెలలకోసారి కిస్తీలు చెల్లించవచ్చు.
- సకాలంలో చెల్లించకుంటే మరుసటి నెలలో అపరాధ రుసుముతో చెల్లించాలి. వయసు మేరకు ప్రీమియం ఉంటుంది.
- రైతులు 60 ఏళ్లు నిండే వరకు కిస్తీలు చెల్లించాలి. ఆ తర్వాత ప్రతి నెలా రూ. 3వేల చొప్పున పింఛన్ అందజేస్తారు.
- రైతు మరణిస్తే జీవిత భాగస్వామికి సగం పింఛన్ అందజేస్తారు.
- పథకాన్ని కొనసాగించేందుకు కనీసం ఐదేళ్లపాటు తనవంతు వాటా ప్రీమియం నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లించాలి.

– సదాశివనగర్(ఎల్లారెడ్డి)

ఎరువుల వివరాలు పక్కాగా ఉండాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి


హొన్నాజీపేట సొసైటీ గోదాంలో ఎరువులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఇందల్వాయి/ధర్పల్లి: ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేసి ఆ వివరాలను స్టాక్ బోర్డుపై రైతులకు తెలిసేలా ప్రదర్శించాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి సొసైటీ సీఈవోలను ఆదేశించారు. ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లె, ధర్పల్లి మండలం హొన్నాజీపేట్ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎరువుల గోదాములు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను తనిఖీ చేశారు. రైతుల అవసరాల మేరకు ఎరువుల అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్.. పాఠశాలల్లో టీచర్ల హాజరును ఫేస్ రికగ్నేషన్ పద్ధతిలో చేపట్టాలన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. అంగన్‌వాడీల్లో విద్యార్థుల ప్రవేశాలు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబర్చేలా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఎల్లారెడ్డిపల్లె పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి నుంచి కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులందరూ ఇంటి నిర్మాణం చేపట్టేలా చూడాలన్నారు. ఇల్లు నిర్మించుకునే వారందరికీ సకాలంలో బిల్లులు చెల్లిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఫిజి, పోర్చుగల్ దేశాల్లో ఉపాధి

- రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ టామ్‌కామ్ ద్వారా వీసాల జారీకి సన్నద్ధం
- విదేశాలకు వలస వెళ్లాలనుకునే నిరుద్యోగులకు అవకాశం
- ప్రభుత్వ రంగ సంస్థ కావడంతో దళారుల మోసాలకు చెక్



మోర్తాడ్(బాల్కొండ): విదేశాల్లో ఉపాధి పొందాలనుకునే నిరుద్యోగులకు ప్రభుత్వ రంగ సంస్థ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) పోర్చుగల్, ఫిజి దేశాల్లో పని కల్పించడానికి వీసాల జారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దళారుల మోసాలకు చెక్‌పెట్టాలనే సంకల్పంతో టామ్‌కామ్ విదేశీ వీసాల జారీకి సన్నద్ధం చేస్తోంది. గతంలో ఇజ్రాయిల్, జర్మనీ, జపాన్, గల్ఫ్ దేశాల్లో ఉపాధి కల్పించిన ఈ సంస్థ తాజాగా పోర్చుగల్, ఫిజి ద్వీపంలో ఉపాధికి బాటలు వేస్తుంది.

పోర్చుగల్‌లో ఇలా...

పర్యాటక రంగంలోనే ఉపాధి అవకాశాలు మెండుగా ఉండటంతో ఈ రంగంలోనే వివిధ హోదాలలో పని చేయడానికి యువతకు అవకాశం ఉంది. ఎగ్జిక్యూటివ్ చీఫ్, కుక్, కిచెన్ అసిస్టెంట్, డిష్ వాషర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఈవెంట్ కో ఆర్డినేటర్, స్పా థెరపిస్ట్ ఉద్యోగాలకు అవకాశం ఉంది. డిగ్రీ, ఇంటర్, హోటల్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ఇతర సర్టిఫికెట్ కోర్సులు చదువుకుని ఐదేళ్ల అనుభవం ఉన్నవారికి వీసాలు జారీ చేయనున్నారు. మన కరెన్సీలో రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు వేతనాలు అందనున్నాయి. హోదాను బట్టి జీతాలను నిర్ణయించనున్నారు. అలాగే ఎఫ్‌బీ మేనేజర్, హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్, హౌస్ కీపర్, వెయిటర్, మెయింటినెన్స్ టెక్నీషియన్‌లుగా పని చేయడానికి అవకాశం ఉంది. డిప్లొమా, హోటల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ, ఐటీఐ ఎలక్ట్రీషియన్ చదువుకుని ఐదేళ్ల అనుభవం ఉన్నవారికి వీసాలు ఇవ్వనున్నారు. ఈ రంగంలో కూడా రూ.90 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు హోదాను బట్టి జీతం చెల్లించనున్నారు.

ఫిజిలో ఇలా...

ఫిజిలో ఎఫ్ఎంసీజీ స్టోర్ మేనేజర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఆటో ఫర్ లిఫ్ట్ మెకానిక్, సర్వీస్ టెక్నీషియన్, పానెల్ బీటర్, పానెల్ పెయింటర్, వాచ్ టెక్నీషియన్, వెల్డర్, బయ్యర్ అసిస్టెంట్, బాకర్, పాస్టీ బాకర్ పోస్టులకు వీసాలు ఇవ్వనున్నారు. రూ.45 వేల నుంచి రూ.80 వేల వరకు వేతనం లభించనుంది. సాంకేతిక నిపుణులు, ఐటీఐ, పదో తరగతి, ఇంటర్ చదివినవారికి అవకాశం కల్పించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ఫిజి, పోర్చుగల్ దేశాల్లో ఉపాధి కోసం జారీ చేయనున్న వీసాలను యువత సద్వినియోగం చేసుకోవాలి. టామ్‌కామ్ వెబ్‌సైట్ లేదా కార్యాలయంలో సంప్రదించాలి. మధ్యవర్తులను నమ్మి మోసపోవడం కంటే ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా వీసాలు పొందడం ఎంతో మేలు.

– నాగ భారతి, టామ్‌కామ్ జనరల్ మేనేజర్

వేర్వేరు చోట్ల జీవాలపై చిరుతల దాడి

- మహంతంలో దూడ, గడ్కోల్‌లో మేక మృతి


మహంతంలో మృతి చెందిన దూడను పరిశీలిస్తున్న అధికారులు

నవీపేట/సిరికొండ: జిల్లాలోని నవీపేట, సిరికొండ మండలాల్లో చిరుతలు జీవాలపై దాడి చేసి చంపేశాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట మండలం మహంతం గ్రామానికి చెందిన మేకల లక్ష్మన్‌కు నాలుగు గేదెలు, రెండు దూడలు ఉన్నాయి. మేత మేశాక ఎప్పటిలాగే గుట్ట కింద భాగంలోని రేకుల షెడ్డులో వీటిని కట్టేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూసేసరికి అందులోని దూడ చనిపోయి ఉంది. చిరుత దాడిగా అనుమానించి బాధితుడు ఫారెస్టు అధికారులకు సమాచారమిచ్చాడు. ఘటనా స్థలాన్ని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు జెహార్, కుద్బుద్దీన్, బీట్ ఆఫీసర్ సుధీర్ పరిశీలించారు. మహంతం గుట్ట నుంచి వచ్చిన చిరుత దూడపై దాడి చేసినట్లుగా నిర్ధారించారు. వెటర్నరీ వైద్యుడు నరేందర్‌రెడ్డి పోస్టుమార్టం నిర్వహించారు.

గడ్కోల్‌లో..


మృతి చెందిన మేక

సిరికొండ మండలం గడ్కోల్ గ్రామానికి చెందిన మనోజ్ శనివారం తన మేకల మందను బొగ్గులకుంట అటవీ ప్రాంతంలోకి మేతకు తీసుకెళ్లాడు. పొదల్లో నుంచి వచ్చిన చిరుత, మేక మెడ భాగంలో దాడి చేసింది. అరుపులు విన్న కాపరులు గట్టిగా కేకలు వేయడంతో మేకను వదిలేసి చిరుత అడవిలోకి వెళ్లిపోయిందని తెలిపారు. గడ్కోల్ బీట్ ఆఫీసర్ దిలీప్ మేకను పరిశీలించారు. ఘటన స్థలంలో మొత్తం గడ్డి ఉండటంతో చిరుత అడుగులు కనబడలేనది ఆయన పేర్కొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరు మృతి


భాస్కర్‌రావు(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని మాధవపల్లి గ్రామానికి చెందిన నడిపోల్ల భాస్కర్‌రావు(30) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారం రోజుల క్రితం గాంధారి-కామారెడ్డి రహదారిపై ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో భాస్కర్‌రావు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. బాధితుడు కోమాలోకి వెళ్లడంతో అక్కడి నుంచి నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఫుడ్ డెలివరీ బాయ్..


గడ్డం కృష్ణ(ఫైల్)

ఖలీల్‌వాడి: నగరంలోని బస్వాగార్డెన్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో గాయపడిన యువకుడు శనివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నాల్గో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ధర్పల్లి మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన గడ్డం కృష్ణ(31) నగరంలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. జూలై 31న రాత్రి 11 గంటలకు వేణుమాల్ నుంచి బస్వారెడ్డి గార్డెన్ వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన కృష్ణను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నట్లు చెప్పారు.

మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ

మాక్లూర్: వాకింగ్‌కు వెళ్లిన మహిళ మెడలోని పుస్తెలతాడును అగంతకుడు లాక్కెళ్లిన ఘటన శనివారం మాక్లూర్ మండలం అమ్రాద్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమ్రాద్‌కు చెందిన మమ్మాయి శృతి మరో ముగ్గురు మహిళలు నిత్యం ఉదయం బీటీ రోడ్డుపై మాణిక్‌భండార్ వైపు వాకింగ్ చేస్తుంటారు. శనివారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన నలుగురు మహిళల్లో మమ్మాయి శృతి మెడలో నుంచి ఒడ్డెట్‌పల్లి వైపు నుంచి బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి బంగారు పుస్తెల తాడును తెంచుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

మోపాల్: మండలంలోని ఓ గ్రామంలో మైనర్ న్యూడ్ ఫొటోలు, వీడియో ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసిన వ్యక్తిపై శనివారం పోక్సో కేసు నమోదైంది. 2019 ఏప్రిల్‌లో ఫేస్‌బుక్‌లో వీడియో, ఫొటోలు అప్‌లోడ్ చేయగా, నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో ఆన్‌లైన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిజామాబాద్ నార్త్ సీఐ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

భర్త డెత్ సర్టిఫికెట్ కోసం సెక్రెటరీపై దాడి

- కేసు నమోదు చేసిన పోలీసులు

మోపాల్: భర్త మరణ ధ్రువీకరణ పత్రాన్ని తనకే ఇవ్వాలంటూ పంచాయతీ సెక్రెటరీపై దాడికి పాల్పడిన ఘటన శనివారం మోపాల్ మండల పరిషత్ కార్యాలయంలో చోటు చేసుకుంది. ఎస్సై సుస్మిత తెలిపిన వివరాల ప్రకారం.. మంచిప్పకు చెందిన రిటైర్డ్ ఏఎస్సై షబ్బీర్ జూన్‌లో మృతి చెందాడు. ఆయన డెత్ సర్టిఫికెట్ కోసం రెండో భార్య పర్వీనా బేగం దరఖాస్తు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మొదటి భార్య రజియా సుల్తానా డెత్ సర్టిఫికెట్ ఇవ్వొద్దని పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌కుమార్‌కు ఫోన్లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో పర్వీనా బేగం సర్టిఫికెట్ తనకే ఇవ్వాలని సెక్రెటరీపై ఒత్తిడి తీసుకొచ్చింది. దీంతో ఆయన ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఈ నెల 6వ తేదీన ఇరువురి సమక్షంలో డెత్ సర్టిఫికెట్ ఇస్తామని అధికారులు తెలిపారు. అయినప్పటికీ పర్వీనా బేగం తనకే ఇవ్వాలంటూ మండలపరిషత్ కార్యాలయంలో శ్యామ్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగి ఫోన్ లాక్కుంది. అంతటితో ఆగకుండా ఆయనపై దాడి చేసింది. ఎంపీవో సహా పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పర్వీనా బేగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడి సరికాదు..

మంచిప్ప పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌కుమార్‌పై దాడిని ఎంపీడీవో రాములు నాయక్, ఎంపీవో కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్ తీవ్రంగా ఖండించారు. విధినిర్వహణలో ఉన్న అధికారులపై దాడి చేయడం సరికాదని పేర్కొన్నారు.